క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకుడితో లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో ఆదివారం నిర్వహించిన రక్తదానం శిబిరానికి విశేషస్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌తో కలిసి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 72 మంది రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ జూలురి రమేశ్, పీఆర్‌ఓ పాషా, సభ్యులు వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



నగదు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని సంగాయి పల్లికి చెందిన బలరాం అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. రూ.3000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, శ్రీను, వినోద్, రాములు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై దృష్టి పెట్టండి

యాచారం: కందుకూర్–యాచారం గ్రామాల మధ్య వంద అడుగుల రోడ్డు విస్తరణకు రోడ్డు భవనాల శాఖ అధికారులు దృష్టి సారించాలని బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనే రోడ్డు విస్తరణకు నిధులు మంజూరైందని, అప్పట్లోనే అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగలేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అధికారులు త్వరలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. రోడ్డు విస్తరణ విషయమై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరినట్లు పేర్కొన్నారు.

అమెరికాలో సీఎంను కలిసిన కిరణ్‌రెడ్డి

కడ్తాల్: అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని, కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ప్రవాస భారతీయుడు, తానా కోఆర్డీనేటర్ గూడూరు కిరణ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడ్తాల్ సమీపంలోని కందుకూర్ మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీ, ముచ్చర్ల ప్రాంతాన్ని ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేస్తామని ప్రకటించినందుకు ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ముచ్చర్లలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో కడ్తాల్ మండలం వేగంగా అభివృద్ధి చెందనుందని, దశదిశ మారనున్నట్లు పేర్కొన్నారు. సొంత గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయులందరూ, రాజకీయాలకతీతంగా, పార్టీలకతీతంగా తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందజేస్తామని ఈ సందర్భంగా కిరణ్ రెడ్డి తెలిపారు.

ఘనంగా అమావాస్య హోమం



ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకొని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా హోమం కార్యక్రమం నిర్వహించారు. హోమం పూర్తి చేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు గురూజీ ప్రవచనాలు చేసి ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం అందించారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమతోపాటు తమ చుట్టూ పక్కల వారి క్షేమం కూడా కాంక్షిస్తూ మెదులుకోవాలన్నారు. నిత్యం భగవంతుడి సాధనలో కొంత సమయాన్ని కేటాయిస్తే ఆటుపోట్లను తట్టుకునే మానసిక సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బీమా.. ధీమా

రైతు బీమాకు దరఖాస్తుల వెల్లువ

- కొత్తవారికి లబ్ధి
- నేటితో ఆఖరు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)



వరి నారుతో పాటు కరిగెడు సిద్ధం చేసుకున్న రైతులు

తలకొండపల్లి: ఆరుగాలం శ్రమించి పంటలను పండిస్తున్న అన్నదాతలకు అకస్మాత్తుగా అనుకోని ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుంది. దీంతో ఆ కుటుంబానికి పెద్ద దిక్కులేక పోషణ భారం బరువై కుటుంబాలు వీధిన పడే అవకాశాలున్నాయి. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం రైతు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంసైతం దీన్ని యథావిధిగా కొనసాగిస్తోంది. మండలంలో సుమారు 30 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. పంటలను సాగు చేస్తూ జీవనం గడుపుతున్న రైతులు సుమారుగా 15వేల నుంచి 20 వేల వరకూ ఉన్నారు. వారిక మేలు చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రైతు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. రైతు బీమాతో రైతుల కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి ఆర్థిక భరోసాను కల్పిస్తుంది. 2018 ఆగస్టు 14న గత ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించింది. అందులో భాగంగా రైతు బీమాకు అవసరమైన ప్రీమియం చెల్లించేందుకు నిధులను కేటాయించింది. రైతు బీమా పథకంతో కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు లేదా ఏ ఇతర కారణాల వల్ల మరణిస్తే పది నుంచి పదిహేను రోజుల్లోనే రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తోంది. రైతుపై ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వమే రైతు బీమా ప్రీమియం చెల్లించనుంది.

కొత్తవారికి లబ్ధి

మండలంలోని 32 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు. గతంలో రైతు బీమా పథకం కింద అర్హులైన 12 వేల మందికి యథావిధిగా ప్రభుత్వమే రెన్యూవల్ చేసి ప్రీమియాన్ని చెల్లించనుంది. మండలంలో కొంత మంది రైతులకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చాయి. వీరంతా రైతు బీమా పథకం కోసం సోమవారం వరకూ దరఖాస్తు చేసుకోవాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కొత్తగా బీమా కోసం దరఖాస్తు చేసుకునే రైతులు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లను దరఖాస్తు ఫారానికి జత చేసి వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలి.

సద్వినియోగం చేసుకోండి



నూతన పట్టాదారు, పాసు పుస్తకాలు వచ్చిన రైతులు గతంలో రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోని రైతులు ఆగస్టు 5వతేదీ వరకు చేసుకోవాలి. సుమారుగా 400 మంది రైతులు కొత్తగా దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– రాజు, ఏఓ, తలకొండపల్లి

అడ్డగోలు పార్కింగ్!

రాకపోకలకు ఇబ్బందులు

- తరచూ ట్రాఫిక్ కష్టాలు
- ప్రయాణికులకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

కడ్తాల్: మండల కేంద్రంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇరువైపులా ప్రైవేట్ వాహనాలను రోడ్డుపై అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ కష్టాలు తీరడంలేదు. వాహనాలను ఇష్టంవచ్చినట్లు నిలపడంతో, పాదచారులు, ప్రయాణికులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై డివైడర్ ఏర్పాటు చేసి నాలుగులైన్ల రహదారిగా మార్చారు. రోడ్డుకు కిరువైపులా వాహనాలు నిలపడానికి ఫుట్‌పాత్ ఏరియా కూడా ఉంది. ఈ ఏరియాలో చిరు వ్యాపారులు దుకణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తుండటంతో, ప్రైవేట్ వాహన దారులు రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను చేరవేస్తున్నారు. ఆటోలు, క్రూయిజర్లు, ద్విచక్రవాహనాలు ఇలాంటివి రోడ్డుపైనే ఉంచుతున్నారు. దీంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి కావడంతో వందలాది వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తాయి. దీంతో నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. దీనికి తోడు కడ్తాల్ పరిసరా గ్రామాలకు జనాన్ని చేరవేసే ఆటోలు, ప్రైవేట్ వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో ట్రాఫిక్ మరింత రద్దీగా మారుతుంది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంది. మండల కేంద్రంలో రోడ్డు కిరువైపులా షాపింగ్ కేంద్రాలు, హోటల్స్ ఉండటంతో వినియోగ దారులు తమ బైక్‌లను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడం ట్రాఫిక్‌కు మరో కారణం. ప్రధానంగా శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి కావడంతో వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ రహదారిపై, ప్రైవేట్ వాహనాలు నిలపకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డుపై నిలిపిన వాహనాలు



తమ్మలోనిగూడ గేట్ వద్ద మొక్కలు నాటి మట్టి నింపని గుంత

నాటారు.. వదిలేశారు..!

ఎండిపోతున్న మొక్కలు

- పూడ్చని గుంతలు
- పట్టించుకోని అధికారులు

యాచారం: అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. రూ. లక్షలు ఖర్చు చేసి నర్సరీల్లో మొక్కలు పెంచి నాటాలనే లక్ష్యానికి అధికారులు గండికొడుతున్నారు. గుంతలు తీయించేవరకే పర్యవేక్షణ. తదనంతరం మొక్కలు నాటారా? లేదా? అనే విషయాలను పట్టించుకోవడం లేదు. పక్షం రోజుల కింద ఎడతెరిపి లేకుండా వర్షాలు కురియడంతో యాచారం మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామ పరిధి సాగర్‌రోడ్డుకు ఇరువైపులా ఈజీఎస్ సిబ్బంది 500 గుంతలు తీశారు. వాటిలో మొక్కలు నాటారు. కానీ మొక్కలు నాటిన గుంతల్లో మట్టి పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఆ మొక్కలు కొన్ని ఎండిపోయాయి. వీటి కోసం ఉపాధి కూలీలు మొక్కలు నాటినట్లు వారికి డబ్బులు చెల్లించేటట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కాని 500కు పైగా గుంతల్లో నాటిన మొక్కలు అలానే ఉన్నాయి. అవి ఎండిపోతున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు అధికారులను పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారే కరువైయ్యారు. కనీసం పర్యవేక్షణ చేయడానికి అధికారులు కృషి చేయకపోవడం బాధాకరం అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి శ్రావణమాసం

ముస్తాబైన శివాలయాలు

ఇబ్రహీంపట్నం: సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుండడంతో ప్రత్యేక పూజలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. ఇబ్రహీంపట్నంలోని పురాతన దేవాలయాలైన భవాని నాగలింగేశ్వర, చెరువు కట్ట కింద గల భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించనున్నారు. చరిత్రాత్మక పురాతన ఆలయాలు కావడంతో శ్రావణమాసంలో నిర్వహించే పూజలకు భక్తులు ప్రాధాన్యత ఇస్తారు. ఈ నెలలో ఐదు సోమవారాలు శ్రావణంలో వస్తుండడంతో శుభపరిణామంగా భక్తులు భావిస్తున్నారు. భద్రకాళీ వీరభద్రేశ్వర ఆలయం చెరువు కట్ట కింద ఉండడంతో ప్రకృతి పచ్చదనంతో కళ్లకు కమనీయంగా, భక్తులకు ఆహ్లాదాన్ని పంచేవిధంగా ఉంటుంది. ఇక్కడ వీరభద్రేశ్వరుడు, భద్రకాళీ మాత పెద్ద రాతి గుండుకు వెలిశారు. ఈ దేవతమూర్తుల ముందు శివలింగం, ఎదురుగా నందీశ్వరుడు, గణపతి మూర్తులుంటారు. ప్రతీ సోమవారం, అమావాస్య, పౌర్ణమికి ప్రత్యేక అభిషేకాలు, అన్నదానం ఆలయ నిర్వాహకులు చేస్తుంటారు. శ్రావణ మాసంలో ప్రత్యేకంగా అర్చనలు, విశేషాభిషేకం, బిల్వపూజ తదితర పూజలు ప్రతీనిత్యం జరుగుతాయని పూజారి మడపతి పవన్ తెలిపారు. శ్రావణమాసం ప్రారంభ తొలిరోజు సోమవారం, పౌర్ణమి (19వ తేదీన), అమావాస్య (సెప్టెంబరు 2వ తేదీన) సోమవారాలే రావడం ఎంతో విశిష్టతతో కూడుకున్నదని భక్తుల నమ్మకం. శ్రావణమాస పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఆ పార్వతిపరమేశ్వరుల కృపకు పాత్రులు కావాలని ఆయా ఆలయ పూజారులు పవన్, శశిధర్‌లు కోరుతున్నారు.



పెద్ద రాతి గుట్టలో వెలసిన వీరభద్రేశ్వరుడు, భద్రకాళీ మాత



ఆలయంలో కొలువైన శివయ్య

అమావాస్య ప్రత్యేక పూజలు



అమావాస్య ప్రత్యేక పూజలో భక్తులు

ఇబ్రహీంపట్నం: ఆదివారం ఆషాడమాస అమావాస్య కావడంతో ఇబ్రహీంపట్నం చెరువుకట్ట కింద గల భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని గణపతి, భద్రకాళి, వీరభద్రేశ్వర, నందీశ్వరునికి శివలింగా దేవతామూర్తులకు ప్రత్యేకాభిషేకాలు, బిల్వపత్రి పూజలు చేశారు. వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛదనం–పచ్చదనం



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు స్వచ్ఛదనం–పచ్చదనానికి సోమవారం నుంచి శ్రీకారం చుట్టనుంది. ఈ నెల 9వ తేదీ వరకూ నిర్వహించే కార్యక్రమాలపై క్షేత్రస్థాయి అధికారులకు టెలికాన్ఫరెన్సులు నిర్వహించి ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే అవగాహన కల్పించారు. మొదటి రోజు ర్యాలీ నిర్వహించి స్వచ్ఛదనం–పచ్చదనంపై అవగాహన కల్పిస్తారు. రెండోరోజు తాగునీటి వనరులు, ట్యాంకులను శుభ్రం చేయడం, క్లోరినేషన్‌ను పరీక్షించుట, చెరువులు, కుంటలను సందర్శిస్తారు. మూడో రోజు నీరు నిలిచిన మురికి కాలువలను, డ్రైనేజీని శుభ్రం చేయడం, రోడ్లపై గుంతలుంటే వాటిని మట్టితో నింపి బాగుచేయడం, నాలుగోరోజు ఆరోగ్యం, పరిశుభ్రత వీధి కుక్కలపై దృష్టి పెట్టడం, పట్టణ, గ్రామ ప్రాంతాల్లో వైద్య సిబ్బందితో ఫీవర్ సర్వే నిర్వహించడం, జ్వర పీడిత ప్రాంతాల్లో యాంటి లార్వా, ఫాగింగ్ చేపడుతారు. ఐదోరోజు శుక్రవారం డ్రై డేగా పాటించడం, ఇళ్లను శుభ్ర పరుచుకొని, పనికిరాని వస్తువులను తీసివేయడం, ఆయా గృహాల ముందు నిలిచిపోయిన నీటిని తొలగించడం, బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ సంస్థల్లో శుభ్రంచేయడం, శిథిలమైన భవనాలను, గోడలను, ఎండిపోయిన చెట్ల కొమ్మలను తొలగించడం, ప్రతీ ఇంటికి ఆరు మొక్కల పంపిణీ చేయనున్నారు. గ్రామ స్థాయిలో ప్రత్యేకాధికారులతో, పంచాయతీ కార్యదర్శి, ఆశ వర్కర్లు, ఆఫీసు బేరర్లతో గ్రామ స్థాయి కార్యకర్తలతో బృందాలను, పట్టణ స్థాయిలో వార్డు బృందాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతుంది.

అధికార యంత్రాంగం సిద్ధం

ర్యాలీ..

తుర్కయంజాల్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్వచ్ఛదనం–పచ్చదనం ప్రారంభోత్సవ ర్యాలీని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె అమరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ ఉదయం 8 గంటలకు తుర్కయంజాల్ చౌరస్తా నుంచి ప్రారంభమై మాసబ్ చెరువు వరకూ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

భాగస్వాములు కావాలి



స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం మొదటి రోజు ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పారిశుద్ధ్యం మెరుగు, మొక్కలు నాటడం, స్వచ్ఛ మంచినీరు తదితర కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. ఈ కార్యక్రమంలో రాజకీయపక్షాలు, యువత, మహిళలు, ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలి.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్

నవయుగ యూత్ కమిటీ ఎన్నిక

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ నవయుగ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిద్దాల కృష్ణ, సభ్యులుగా పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిద్దాల బాలప్ప, సిద్దాల శ్రీశైలం, కేమాద్రి, అర్కల కాశీ, దామోదర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు: బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారికి భరోసా కల్పించారు. రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. అందరూ కష్టపడి పార్టీ బలోపేతానికి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్. సురేందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ సర్పంచులు జ్యోతిశేఖర్, గోపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు మేఘనాథ్‌రెడ్డి, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్, దర్శన్‌రెడ్డి, వెంకటేష్, దేవులానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్‌ఎఫ్ వరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణపూర్ గ్రామానికి చెందిన తారాసింగ్‌నాయక్ అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని గోలి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. దీంతో మంజూరైన రూ.16,500 చెక్కును ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తారాసింగ్ నాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ నాగులు నాయక్, తలకొండపల్లి మండల టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, సుమన్, గురువయ్య, శ్రీను, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు: పట్టణ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో టీఆర్ఎస్ నాయకుడు బాణోత్ రమేశ్‌నాయక్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ అనురాధ, కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్‌లు పులుగోనిపల్లి తండాకెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు రూ.35 వేలు ఆర్థికసాయం అందజేశారు. మున్సిపాలిటీ టీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యులు లచ్చిరాంనాయక్, పంతునాయక్, మాజీ సర్పంచులు లక్ష్మణ్‌నాయక్, సోన శ్రీనునాయక్, నాగులునాయక్, రమేశ్, సోమ్లు, రైసల్ నాయక్, కొత్త భాస్కర్‌రావ్ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్